


# తండ్రీ నీ విలువెంత?

పేరూ ఊరూ మార్చేసి ఒకానొక దౌర్భాగ్యపు తండ్రి యదార్థగాథ చెబుతాను. పేరు రామయ్య. నలుగురు మగపిల్లలూ, ముగ్గురాడ పిల్లలూ సంతానం. వృత్తి పరంగా అతను తాపీ మేస్త్రి. అతనిది మా ఊరే. చల్లని ఇల్లు కట్టాలంటే రామయ్యకు రామయ్యే సాటి. అతని చేతులు చల్లనివి అతని మనసూ, మాటా చల్లనివి. మా ఊళ్ళో అతని వృత్తి గిరాకీ ఎక్కువ. ఎందరెందరికో ఇళ్ళు కట్టేడు. తన కోసం మాత్రం గొప్ప గాలిమేడ కట్టుకున్నాడు.

రామయ్య సంతానంలో జ్యేష్ఠుడు జగన్నాధం. జగన్నాధానికి చదువు సంధ్యలు చెప్పించి పెద్దవాడ్ని చేసి పెద్ద హోదాలో వుండి తన

కుటుంబ సౌభాగ్య సౌధాన్ని పదికాలాలపాటు నిలబెట్టుకునే ప్రయత్నం చేసి సాధించి తీరాలనుకున్నాడు. అందుకోసం తన సంపాదనలో మూడో వంతు జగన్నాధం చదువుకి పెట్టుబడి పెట్టేడు. అదొక మహా యజ్ఞంగా ఎంచుకున్నాడు.

యజ్ఞం నిర్విఘ్నంగా ముగిసినా, దానికి రామయ్య నెత్తురు చాలా ఖర్చయింది. ఓపిక ఖర్చయింది. జవసత్వాలు ఖర్చయ్యేయి. డబ్బు సరేసరి, పూర్తిగా ఖర్చయి పోయింది. ఆ పైన వాళ్ళ కాళ్ళూ, వీళ్ళ కాళ్ళూ పట్టుకుని జగన్నాధానికి పెద్ద ఉద్యోగమే వేయించేడు. పెద్దింటి పిల్లతో ఎంతో వైభవంగా పెళ్ళి జరిపించేడు. కొడుకూ, కోడలూ బొంబాయి వెళ్ళి పోయేరు. జగన్నాధం వుద్యోగం బొంబాయిలో కుదిరింది. మూడు వేలకు పైగా జీతం. రామయ్య రెస్టు తీసుకోవచ్చుని తలిచేడు. మిగతా పిల్లల బాగుని జగన్నాధం చేతుల్లో పెట్టి తాను తప్పుకుందా మనుకున్నాడు. కథ అడ్డం తిరిగింది. బరువు బాధ్యతలుతీసుకునేందుకు జగన్నాధం భయపడ్డాడు. నావల్ల కాదని ఖచ్చితంగా చెప్పేడు. రామయ్య బెంబేలు పడిపోయేడు. ఖంగారు పడ్డాడు. అయినా దాచుకున్నాడు. జగన్నాధం పెళ్ళికి చేసిన అప్పు పెరిగి పోతుందే కానీ జగన్నాధం కనీసం నయాపైసా అయినా పంపడంలేదు. రామయ్య కట్టుకున్న గాలిమేడ కూలిపోయింది. రుణ భారం ఎక్కువయింది. మిగతా పిల్లల చదువులు ఆగిపోయేయి. అన్నయ్యని పెంచి, మమ్మల్ని అన్యాయం చేసేవనే వాళ్ళ విమర్శలకు తట్టుకోలేక పోతున్నాడు. తాపీ పట్టుకుంటే చేతులు వణుకుతున్నాయి, మనసు వృత్తి మీద లగ్నం కావడం లేదు. అతని పవరు తగ్గిపోయిందన్నారు జనం. దాంతో అతనిగిరాకీ పడిపోయింది. మేస్త్రీ రామయ్య కూలీగా మారిపోయేడు. ఇంత జరిగినా ఆ తండ్రి యింకా దిలాసాగా వున్నాడంటే అందుకో కారణముంది. తాను పెంచి పెద్ద చేసిన బిడ్డ బొంబాయిలో ఖరీదుగా కులాసాగా వున్నందుకు అతనెంతో గర్విస్తుంటాడు. ఆ గర్వంతో తన సొంత కష్టాన్ని, పిల్లల దురదృష్టాన్ని కొంతైనా మరచిపోగలుగుతున్నాడు.

అట్లాంటి రామయ్య, కొడుకుని చూసుకుందామని ఎక్కడో అప్పు చేసి బొంబాయి వెళ్ళేడు. ఆ తండ్రికి జగన్నాధం ఘన సన్మానం చేసి తరిం చేడు. జగన్నాధం యింటికి ఎవరో తెలుగు (గొప్ప) వారు వచ్చినప్పుడు వాళ్ళముందు తిరుగుతున్న రామయ్యని ఎవరో అడిగితే ఇంగ్లీషులో సమా ధానం చెప్పేడు. ఏమని? ఇతను మా ఇల్లు కట్టిన తాపీ మేస్త్రీ. మా కుటుం బంతో అనుబంధం పెంచుకున్న వ్యక్తి.

రామయ్యకి ఇంగ్లీషురాని మాట నిజమే. కాని, వచ్చిన వారు తెలు గులో మాట్లాడేరు. ఆఫ్టరాల్ ఒక తాపీ మేస్త్రీని ఇంట్లో ఒక మనిషిగా చూసుకుంటున్న జగన్నాధాన్ని తెగ మెచ్చుకున్నారు. స్టేటస్ పాటించకుండా తాపీ మేస్త్రీని ఆదరిస్తున్న జగన్నాధం సంస్కారం ఎంతో గొప్పదన్నారు. అప్పటిగ్గాని రామయ్యకి అసలు కథ అర్థం కాలేదు. కన్నతండ్రిని తండ్రిగా చెప్పకోలేని జగన్నాధం నీచాన్ని రామయ్య హర్షించలేక పోయాడు. కన్న బిడ్డ దుర్మార్గం అతనిగుండెల్లో బాకు మల్లె పొడిచింది. తట్టుకోలేక పోయాడు రామయ్య. ఆ మర్నాడే చెప్పా పెట్టకుండా రైలెక్కి మా ఊరొచ్చేసేడు. ఈ పిచ్చి తండ్రి కథ ఆ నోటా ఈ నోటా ప్రచారమై నావరకూ వచ్చింది, విన్నవాడిని నేనే ఇంత తల్లడిల్లిపోతే ఆ తండ్రి మానసిక సంక్షోభాన్ని సహృదయ పాఠకులకు ఏమని వర్ణించను? ఎట్లా వర్ణించను?

తండ్రి వృత్తి, తండ్రి భాషా ఆ తనయుడికి అవమానంగానే తోచ వచ్చును. డాడీ అని పిలిచేందుకు తగని తండ్రి ఒక తండ్రేనా అని బాధగా వుండొచ్చును. అతిధులకు షేక్‌హేండ్‌నిచ్చి నేనింగ్లాండులో వుండగాంటూ, హరికథలు చెప్పే స్థోమత తన తండ్రికి లేదేమోనే చింత అతన్ని కలవర పెట్టి వుండొచ్చును. అంత మాత్రాన తాపీ మేస్త్రీ రామయ్య తన తండ్రి కాదనే స్టేట్‌మెంట్ పచ్చి కిరాతకంగా అతను భావించనందుకు నేను విచార పడుతున్నాను. జగన్నాధంలాంటి వ్యక్తి సమాజానికి చీడ పురుగని చెప్పేం దుకు నేను వెనుకాడనని పునని చేసుకుంటున్నాను. హోదా ఇచ్చిన మత్తులో తండ్రిని గౌరవించలేని కొడుకు కొడుకే కాడని నా చిన్నప్పుడు తెలుగు

మాష్టారు చెప్పేరు. ఆయన్నికూడా వాళ్ళబ్బాయి ఇట్లాంటి దెబ్బే కొట్టాడని నేను ఎదిగిం తర్వాత తెలుసుకున్నాను. కన్న తల్లిదండ్రుల్ని గౌరవించలేని రౌడీ ప్రపంచాన్ని ఉద్ధరిస్తాడంటే నేను నమ్మను. ఎక్కడో ప్రపంచ మెందుకు? స్నేహితులూ, పరిచయస్తులూ, తోటివ్యక్తులూ అందర్నీ ఛీట్ చేయగల స్కౌండ్రల్ నెంబర్ వన్ అని ఖచ్చితంగా చెప్పగలను. కేవలం హోదాలతోనే బంధుత్వం కలుపుకొనే లౌక్యుడు పశువుకన్నా హీనం. ఫలానా జమీందారు మా నాన్నారు సుమా అని అబద్ధం చెప్పి తన హోదా కోసం కన్నతల్లిని సైతం తాకట్టు పెట్టగల ఈ దుర్మార్గులు భూమికి బరువు.

తండ్రి తాపీమేస్త్రీ కావచ్చు, వడ్రంగి కావచ్చు, నేత పనివాడు కావచ్చు. ఇదుగో ఈ వ్యక్తి నా కన్నతండ్రి. దరిద్రంలో, కష్టంలో, కలత లతో బతుకుతూ కూడా నన్ను పెంచిపెద్దచేసి నన్ను ఈ హోదాలో వుంచిన తండ్రి ఇతను. నన్ను గౌరవించడం గొప్పకాదు. ఈ మహావ్యక్తికి చేతు లెత్తి నమస్కరించండి. ఇతడు దేవుడితో సమానమని రామయ్య గురించి జగన్నాధం చెప్పి వుంటే ఎన్ని యిబ్బందులు వచ్చిపడినా నిండా నూరేళ్ళు బతికేవాడు. రామయ్య ఆ ఛాన్సు వాళ్ళబ్బాయి అతని కివ్వలేదు. గనక రామయ్యత్వరగానే వెళ్ళి పోయాడు. అయ్ పిటీ హిమ్.